పండ్లవ్యాపారం ముసుగులో..
అక్రమ మద్యం అమ్మకం

● ముగ్గురి అరెస్టు... రూ.3లక్షల మద్యం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న కడప ఎక్సైజ్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

కడప క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఐటీఐ ప్రాంతానికి చెందిన రఘురామిరెడ్డి పండ్ల వ్యాపారం చేస్తూ ఆ ముసుగులో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తెచ్చి జిల్లా అంతా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నాలుగు సంవత్సరాలుగా ఈ దందా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అతడి ముగ్గురు అనుచరులను పోలీసులు అరెస్టు చేశారు. కడప చిన్నచౌకులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్‌లో ఎక్సైజ్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి సూపరింటెండెంట్ రవికుమార్‌తో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. కడప అలంఖాన్‌పల్లెలోని కేసీకెనాల్ సమీపంలో పాండిచ్చేరి, గోవాకు చెందిన మద్యం సీసాలను స్కూటీలో తరలించేందుకు కారులో నుంచి తీస్తున్న సమయంలో ఎక్సైజ్ సీఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, కడప ఐటీఐ ప్రాంతానికి చెందిన రఘురామిరెడ్డి ఇతర రాష్ట్రంలో ఉన్న మహేశ్‌తో కలిసి అక్రమంగా మద్యం కడపకు తెప్పించి ఇక్కడ నుంచి జిల్లా అంతటా విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారిచ్చిన సమాచారం మేరకు శాటిలైట్ సిటీలో ఓ ఇంటి వద్ద ఐచర్, టాటా ఏసీ వాహనాల్లో మద్యం సీసాలు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడు రఘురామిరెడ్డి అనుచరులైన కడపకు చెందిన శివ, వెంకటేశ్, మహేశ్‌లను అరెస్టు చేసి కారు, స్కూటీ, ఐచర్, టాటా ఏసీ వాహనాలను స్వాధీనం చేసుకుని 28 బాక్సులు (ఒక్కో బాక్స్‌కు 12 ఫుల్‌బాటల్స్) 750 ఎంఎల్ నెపోలియన్ కొరియర్, మాన్సన్‌హౌస్, మెక్‌డోల్ విస్కీ సీజ్ చేశారు. మద్యం విలువ రూ.3 లక్షలు, వాహనాల ధర రూ.7లక్షల వరకు ఉంటుందని ఎక్సైజ్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ప్రధాన నిందితుడు రఘురామిరెడ్డి పరారీలో ఉన్నారు. గతంలో ఇతడిపై పీడీ యాక్టు నమోదయిందన్నారు. గోవా మద్యం నకిలీదని, దీనిని తాగడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం, వాహనాలు

ఏపీలో మంచి మద్యం దొరుకుతుందని ఇతర రాష్ట్రాల మద్యం ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్, విజిలెన్స్ సీఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయానికి
2 ఎకరాలు కేటాయింపు

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు టీడీపీ జిల్లా కార్యాలయానికి భూ కేటాయింపులు జరిగాయి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. కడప నగరం అక్కాయపల్లె సర్వే నెంబరు 37/4లో రెండు ఎకరాల భూమిని టీడీపీ జిల్లా కార్యాలయానికి కేటాయిస్తూ జీవో నెంబరు 5న ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా మంగళవారం జారీ చేశారు. లీజ్ ప్రాతిపదికన మంజూరు చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తగ్గేదేలే..!



జగన్ హయాంలోని వైసీపీ నేతలే కాదు.. కూటమి ప్రభుత్వంలోని టీడీపీ నేతలూ భూ ఆక్రమణలలో తగ్గేదేలే.. అనేలా వ్యవహరిస్తున్నారు. వైసీపీ పాలనలో కబ్జాలలో బాగా పేరున్న ఓ గ్యాంగ్ టీడీపీలో చేరింది. వారే కడపలో ఎక్కడెక్కడ స్థలాలు ఉన్నాయో గుర్తించడం, వాటికి డాక్యుమెంట్లు తయారు చేయడం, ఇది తమదేనంటూ కోర్టుకు వెళ్లడం.. కోర్టుకు వెళ్లకుండా రెవెన్యూ డిపార్ట్‌మెంటును మేనేజ్ చేయడం ఇలా పక్కా స్కెచ్‌తో రూ.కోట్ల విలువ చేసే స్థలాలను కొట్టేస్తున్నారు. వైసీపీకి ఏమీ తీసిపోని విధంగా టీడీపీ అండ్ కో వ్యవహరించడంతో జనం ఔరా అంటున్నారు. తాజాగా కడప నగరంలోని ద్వారకానగర్‌లో రూ.15కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని చదును చేశారు. విశేషం ఏమంటే ఇక్కడ 'ఇది ప్రభుత్వ భూమి' అని హెచ్చరిక బోర్డు ఉంది. అయినా కబ్జాదారులు లెక్కచేయకుండా చదును చేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు.

● కూటమి ప్రభుత్వంలోనూ భూకబ్జాలే
● కడప ఎమ్మెల్యే ఇంటికి సమీపంలోనే..
● రూ.15 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమికి స్పాట్
● చదును చేసి ఆక్రమించే యత్నం

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన భూకబ్జాల పాపాల పుట్ట బద్దలవుతోంది. ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమించేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సీఎం చంద్రబాబు వైసీపీ భూకబ్జాలపై ప్రత్యేక దృష్టి సారించారు. వైసీపీ నేతలు చేసిన భూకబ్జాలపై జనం పెద్దఎత్తున ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నారు. వైసీపీ కబంధ హస్తాల్లో ఉన్న భూములను విడిపించేందుకు సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ చర్యలు తీసుకున్నారు. జేసీ అదితిసింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఓ పక్క వైసీపీ చేసిన భూకబ్జాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంటే.. ఇదే సమయంలోనే సుమారు రూ.15కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమికి ఎసరు పెట్టి దానిని చదను చేసేయడం హాట్‌టాపిక్‌గా మారింది. అదేదో మారుమూల గ్రామమా అంటే కాదు.. ఫైర్‌బ్రాండ్‌గా ముద్రపడ్డ కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ఇంటికి కూతవేటు దూరంలోనే మంచి విలువ చేసే ప్రభుత్వ భూమిని కొట్టేసే ప్రయత్నం జరగడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కడప నగరంలో ద్వారకానగర్ విలువైన ప్రాంతం. ఇక్కడ సెంటు స్థలం సుమారు రూ.50లక్షల పైనే ఉంటుంది. మాజీమంత్రి అహ్మదుల్లా, ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధనరెడ్డి, ప్రముఖ డాక్టర్లు, కీలకమైన ఆసుపత్రులన్నీ ఇక్కడే ఉన్నాయి. అందుకే ఇక్కడ అడుగు జాగా దొరికినా సరే జనం సంబరపడతారు. అంత విలువైన ప్రాంతం ఇది. ఇక్కడ నాగరాజుపల్లె సర్వే నెంబరు 71/1లో 2.52 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇది బుగ్గవంకకు ఆనుకునే ఉంది. ఆన్‌లైన్‌లో అనుభవదారు పేరు 'వాగు' అని ఉంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అక్కడ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు లేఅవుట్ వేశారు. నిబంధనల ప్రకారం పార్కు, కమ్యూనిటీ హాలు, ప్రార్థనామందిరం కోసం ఓపెన్ ప్లేస్ కేటాయించారు. అయితే ఇక్కడ ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా రిమ్స్ సమీపంలోని ఇందిరానగర్‌లో ఇచ్చారు. దీంతో ఇక్కడున్న 2.52 ఎకరాల స్థలంలోనే ప్రస్తుతం రైతుబజార్ ఉంది. అప్పట్లోనే దోబీఘాట్, ప్రార్థనామందిరం ఏర్పాటు చేశారు. మిగిలిన దాదాపు 40 సెంట్ల స్థలాన్ని తాజాగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.


ద్వారకానగర్‌లో కబ్జాదారులు చదును చేసిన రూ.15కోట్ల విలువ చేసే స్థలం

ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు ఉన్నా..

గత కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ హయాంలో సైతం ఈ స్థలాన్ని కొట్టేసేందుకు స్కెచ్ వేశారు. అప్పట్లో ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చాయి. దీంతో బ్రేక్ పడింది. వైసీపీ హయాంలో మరోమారు కబ్జాకు ప్లాన్ చేసినప్పటికీ ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో బ్రేక్ పడింది. ఇక్కడ రెవెన్యూ అధికారులు 'ఇది ప్రభుత్వ భూమి.. దీనిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోబడును' అని హెచ్చరిక బోర్డు సైతం ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్నికల ముందు టీడీపీలోకి చేరిన ఓ వైసీపీ బ్యాచ్ కడపలో స్థలాలు కాజేసేందుకు పక్కాగా స్కెచ్ వేస్తోంది. ఇదే గ్యాంగ్ కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ఇంటికి దగ్గరలో ఉన్న సుమారు రూ.15కోట్ల విలువ చేసే స్థలాన్ని కొట్టేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించి ఇది మాదేనని చదును చేసేశారు. అయితే విషయం ఒక్కసారిగా బయటికి వచ్చింది. గతంలో ఈ స్థలం పక్కనే రజకుల కోసం దోబీఘాట్‌ను 1999-2004 మధ్య చంద్రబాబు ప్రభుత్వమే నిర్మించింది. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు హయాంలోనే రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని అదీ ఎమ్మెల్యే ఇంటి పక్కనే కొట్టేసేందుకు స్కెచ్ వేయడం పెద్ద చర్చనీయాంశమైంది. ఇక కడపలో కీ రోల్‌గా ఉన్న ఓ నేత పీఏ దగ్గరుండి ఈ సైట్ చదను చేసినట్లు చెబుతారు. గతంలో వైసీపీ హయాంలో కూడా ఈ స్థలాన్ని కబ్జా చేయాలనుకున్నా సాధ్యం కాలేదు. ఇప్పుడు ఏకంగా చదును చేసి కొట్టేసేందుకు ప్లాన్ చేశారు.

రెవెన్యూ హ్యాండ్సప్

జిల్లాలో భూకబ్జాలను అరికట్టేందుకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జేసీ అదితిసింగ్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. వారి దృష్టికి వస్తే వెంటనే స్పందిస్తున్నారు. అయితే కడపలో మాత్రం రెవెన్యూ యంత్రాంగం చేతులు ఎత్తేస్తోందనే విమర్శలున్నాయి. అది ఎంతలా అంటే... జిల్లాకే కడప హెడ్‌క్వార్టర్, మంచి ప్రైమ్ లోకేషన్‌లోనే రూ.15కోట్ల విలువచేసే స్థలం కబ్జా చేసినా పట్టించుకోవడంలేదు. కడప ఆర్డీవో, తహశీల్దారు మెతకవైఖరిగా ఉండడంతో ఆ శాఖ సిబ్బందే లైట్ తీసుకున్నారనే విమర్శ ఉంది. కాగా.. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జా విషయమై కడప తహశీల్దారు ఎంవీ నారాయణరెడ్డిని వివరణ కోరగా.. ఆ విషయం తమ దృష్టికి రాలేదని అన్నారు.


గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అరటి అధరహో..!

● టన్ను రూ.22వేల నుంచి రూ.25వేలు
● అరబ్ దేశాలు, శ్రీనగర్‌లో మంచి డిమాండ్
● సీజన్ ప్రారంభం కాకముందే అరటికి మంచి ధర


పులివెందుల ప్రాంతంలో సాగైన అరటి తోట

పులివెందుల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అరటి ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గత 15రోజుల క్రితం వరకు టన్ను అరటి రూ.14వేల నుంచి రూ.15వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ.22వేల నుంచి రూ.25 వేలు పోతోంది. సీజన్ ప్రారంభం కాకముందే ఈ ధర ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పులివెందుల నియోజకవర్గం అరటి సాగుకు పెట్టింది పేరు. ఇక్కడి లింగాల, పులివెందుల, సింహాద్రిపురం, తొండూరు, వేముల, వేంపల్లె మండలాల్లో విరివిగా అరటి సాగుచేశారు. దాదాపు 25వేల ఎకరాల్లో ప్రస్తుతం సాగులో ఉంది. అరటి ఒక సీజన్ అని కాకుండా ఎప్పుడు పడితే అప్పుడు సాగుచేస్తుంటారు. కానీ అధిక శాతం రైతులు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్.. ఈ మూడు మాసాల్లో పంట చేతికొచ్చేలా సాగుచేస్తారు. అరటి ధరలు కూడా ఈ మూడు నెలల్లోనే బాగా పెరుగుతాయి. చలి తగ్గుముఖం పట్టినప్పటి నుంచి మన దేశంలోని కలకత్తా, ఢిల్లీ, శ్రీనగర్, హర్యానా తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. అలాడే అరబ్ దేశాలకు కూడా పులివెందుల అరటి ఎగుమతి అవుతోంది.

ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాలు మినహా మిగిలిన నెలల్లో అరటికి అంత ధర పలకదు. మిగిలిన మాసాల్లో రూ.14వేల నుంచి రూ.17వేల వరకు మాత్రమే ధర ఉంటుంది. కానీ ఈ ఏడాది డిసెంబరు 20వ తేదీ నుంచే ధరలు పెరగడం ప్రారంభమయ్యాయి. జనవరి మొదటి వారంలోనే నాణ్యమైన అరటి రూ.25వేలు పలుకుతోంది. ఈ ధర ఇంతటితో ఆగకుండా ఇంకా పైపైకి పోతుందని అటు వ్యాపారులు, ఇటు రైతులు అంటున్నారు. రైతు పంట సాగుచేసిన ఏడాదికి వచ్చే మొదటి గెల, రెండో గెలకు ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. మొదటి గెలకు ప్రస్తుతం రూ.25వేలు, రెండవ గెల రూ.18వేల వరకు పలుకుతోంది.

అరబ్ దేశాలకు, శ్రీనగర్‌కు ఎగుమతులు

ప్రస్తుతం పులివెందుల అరటి అరబ్ దేశాలకు మన దేశంలోని శ్రీనగర్‌కు విరివిగా ఎగుమతి అవుతోంది. పులివెందుల అరటి మిగిలిన ప్రాంతాల్లో పండే అరటికి భిన్నంగా ఉంటుంది. ఇక్కడి రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని సాగుచేస్తున్నారు. అందులోను ఈ ప్రాంత భూముల్లో పండే అరటి ఎక్కువ కాలం పాడవకుండా ఉంటుందని వ్యాపారులు, రైతులు అంటున్నారు. మిగిలిన ప్రాంతాల్లో పండే అరటి 8 నుంచి 10రోజులు మాత్రమే ఉంటుందని.. కానీ పులివెందుల అరటి 12 నుంచి 14రోజులు నిల్వ ఉంటుందని అంటున్నారు. అందులోను పులివెందుల ప్రాంతంలో పంట పొలాలు అంత సారవంతమైనవి కాకపోవడం, కొంత చౌడునేలలు కావడంతో ఇక్కడి అరటి నాణ్యత, రుచి కూడా ఎక్కువే అని రైతులు అంటున్నారు. అరబ్ దేశాలైన కువైత్, సౌదీఅరేబియా, ఒమన్ తదితర దేశాలకు పులివెందుల అరటి ఎక్కువగా ఎగుమతి అవుతోంది. అలాగే శ్రీనగర్‌కు కూడా అరటి ఎగుమతి జరుగుతుంది.

ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాల్లో మన దేశంలోని కశ్మీర్, ఢిల్లీ, కలకత్తా, హర్యాన తదితర రాష్ట్రాలకు ఎగుమతులు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభం కాకముందే అరటికి మంచి ధర రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలంతా ధరలు తగ్గకుండా పెరిగితే కాసుల పంట పండినట్లేనని రైతులు అంటున్నారు. ఏప్రిల్, మే మాసాల్లో ఈదురుగాలులు వచ్చే అవకాశం ఉంది. ఆ సమయానికి పంట చేతికొచ్చేస్తుందని అంటున్నారు. నియోజకవర్గంలో గత ఏడాది అత్యధికంగా టన్ను రూ.29,500 పలికిందని ఈ ఏడాది అంతకంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొన్నారు.

జనరల్ బాడీ తీర్మానాలు ఆమోదించండి

● కమిషనర్‌కు కార్పొరేటర్ల వినతి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సర్వసభ్య సమావేశంలో జనరల్ బాడీ తీర్మానాలను ఆమోదించాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్‌ను కార్పొరేటర్లు కోరారు. గత నెల 23వ తేదీ జరిగిన కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంగళవారం కమిషనర్ మనోజ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం నగరపాలక సంస్థకు సంబంధించిన లీగల్ అడ్వైజర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ గత నెల 23వ తేదీన జరిగిన సర్వసభ్య సమావేశంలో నగర అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన అంశాలకు సంబంధించి ఏకగ్రీవ తీర్మానాలు ఉన్నాయన్నారు. దాదాపు రూ.22 కోట్లకు సంబంధించిన అభివృద్ధి ఆగిపోనుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం జరిగిన రోజున అడుగడుగున ఆటంకం కలగడంతో 8 మంది కార్పొరేటర్లను మేయర్ సస్పెండ్ చేశారని తెలిపారు. సభను వాయిదా వేసి తిరిగి కొనసాగించే క్రమంలో మళ్లీ సభలో గందరగోళం ఏర్పడిందన్నారు. అయినప్పటికీ నగర అభివృద్ధి కుంటుపడకుండా ఉండేందుకు అప్పటికే అజెండా కాపీలు పూర్తిగా చదివిన తాము ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. అయితే కమిషనర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపకపోవడంతో తాము మళ్లీ ఆయనను కలిసి అడిగామన్నారు. ఆరోజు జరిగిన సమావేశంలో మీరు ఏకగ్రీవంగా చేతులెత్తినప్పటికీ తాను సరిగా చూడలేదని లీగల్ ఒపీనియన్‌కు పంపాలని సమాధానం ఇచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో తాము మరోసారి కడప కమిషనర్‌తో పాటు లీగల్ అడ్వైజర్‌కు వినతిపత్రాలు సమర్పించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరామన్నారు. దీనిపై లీగల్ అడ్వైజర్ సుధాకర్ బాబ్జి మాట్లాడుతూ.. తనకు సుమారు 33 మంది సంతకాలు చేసిన వినతిపత్రాన్ని కార్పొరేటర్లు సమర్పించారని తెలిపారు. తామందరం అజెండాను పూర్తిగా చదివి కడప నగర అభివృద్ధి కోసం ఏకగ్రీవంగా తీర్మానించామని కార్పొరేటర్లు తెలిపారన్నారు. ఈ మేరకు చట్టప్రకారం తన అభిప్రాయాన్ని ప్రభుత్వానికి పంపుతానన్నారు.


కడప కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు

ట్రిపుల్‌ఐటీల్లో ఆర్టిఫిషియల్, మిషన్ లర్నింగ్‌కు శ్రీకారం

వేంపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాల్లో డిమాండ్ ఉన్న కోర్సులైన ఆర్టిఫిషియల్, మిషన్ లర్నింగ్‌లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ట్రిపుల్‌ఐటీల్లో విద్యాబోధన అమలు చేయనున్నట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సండ్ర తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మంగళవారం ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులతో, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీల్లో విద్యాబోధన నాణ్యంగా మెరుగైన ప్రమాణాలతో అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠ్యాంశాల్లో (కరికులం) సమూల మార్పులు తీసుకురానున్నట్లు తెలిపారు. ట్రిపుల్‌ఐటీలో చేరి పీయూసీ మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీయూసీ ద్వితీయ సంవత్సరం పూర్తయ్యేలోగా అన్ని సబ్జెక్టులు పాసయ్యేలా విద్యార్థులకు ఎప్పటికప్పుడు తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్

పాండవుల బావులు

● భీముడి గదాఘాతంతో ఏర్పడ్డ నీటి గుండాలు
● నేటికీ గ్రామ నీటి అవసరాలు తీర్చుతున్న గుండాలు
● భీముడి పేరుతో భీమగుండం గ్రామం

6




56 కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన జగన్‌రెడ్డి

● చంద్రబాబు పాలనలోనే బీసీలకు చేయూత ● ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట సదాశివం

కడప మారుతీనగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా 56 కార్పొరేషన్లను ఏర్పాటుచేసిందే కానీ వాటి నిధులను సైతం నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నవరత్నాలకు బదిలీచేసి ఆయా కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట సదాశివం నిప్పులు చెరిగారు. ఏపీ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నూర్జహాన్ కళ్యాణమండపంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తూరు గురుస్వామి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన సదాశివం మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి దళిత, గిరిజన బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల నోట్లో దుమ్ముకొట్టారన్నారు. 5 సంవత్సరాల పాలనలో బీసీ సబ్‌ప్లాన్ నిధులతో పాటుగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కూడా పక్కదారి పట్టించారన్నారు. నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవాలయాలలో కేశఖండన వృత్తి సేవలందిస్తున్న వారికి గతంలో ఇస్తున్న రూ.15వేలను రూ.25 వేలకు పెంచారని గుర్తు చేశారు. అంతేకాకుండా అన్ని దేవాలయాల పాలకమండళ్లలో నాయీబ్రాహ్మణులకు చోటు కల్పించిన ఘతత చంద్రబాబుకే దక్కిందన్నారు. చంద్రబాబు పాలనలోనే బీసీలకు చేయూత లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎం.రవీంద్రనాథ్ బాబు, విశ్రాంత డీజీపీ జేడీకే సురేంద్ర బాబు, సంఘం రాష్ట్ర నాయకులు ఎం.కనకారావు, బ్రహ్మయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి రాజాప్రతాప్, కార్యదర్శులు జగన్నాథం, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.


పాండవుల బావులు


గుండంలోని నీరు

- భీముడి గదాఘాతంతో ఏర్పడ్డ నీటి గుండాలు
- నేటికీ గ్రామ నీటి అవసరాలు తీర్చుతున్న గుండాలు
- భీముడి పేరుతో భీమగుండం గ్రామం

పెద్దముడియం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కొన్ని సంవత్సరాల క్రితం వరకూ గ్రామాల్లోని జనం నీటి అవసరాలను దిగుడు, చేదుడుబావులు తీర్చేవి. భూగర్భజలాలు తగ్గిపోవడంతో బావులు కాస్త కనుమరుగయ్యాయి. తరువాత 200 నుంచి 500 అడుగుల లోతులో ఉన్న పాతాళగంగను చేతిబోర్లు, విద్యుత్ మోటార్లు ద్వారా నీటిని తోడుకుని జనం నీటి కష్టాలు తీర్చుకునేవారు. ప్రస్తుతం ఉపరితల నీటి ట్యాంకులు వచ్చి పైపులైన్ల ద్వారా ఇళ్ల వద్దకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం భూగర్భజలాలు వందల అడుగుల లోతుల్లోకి పడిపోయాయి. బావులు, బోర్లు, చేతిపంపులు కనుమరుగయ్యాయి. అయితే పెద్దముడియం మండలంలోని ఆ గ్రామంలో మాత్రం కొండ ప్రాంతంలో నేటికీ ఐదు నుంచి పది అడుగుల లోతులో జలకళతో నీటి గుండాలు కొన్ని దర్శనమిస్తున్నాయి. చేతిబోర్లు, విద్యుత్ మోటార్లు, నీటి ట్యాంకులు వంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినా నేటి వరకు ఆ గ్రామస్థుల నీటి అవసరాలు తీర్చుతున్నాయి. ఎప్పుడో శతాబ్దాల క్రితం ఈ నీటిగుండాలు ఏర్పడ్డాయి. మా పూర్వీకులు చెప్పేవారంటూ గ్రామస్థులు అంటున్నారు. పెద్దముడియం మండలంలోని కొండ ప్రాంతంలో గల భీమగుండం గ్రామానికి ఓ చరిత్ర ఉందని పూర్వీకులైన మా పెద్దలు చెప్పేవారని గ్రామస్థులు తెలుపుతున్నారు. భీమగుండం గ్రామం కొండ ప్రాంతం. ఈ ప్రాంతంలో పూర్వం దట్టమైన అటవీ ప్రాంతం ఉండేదని, మహాభారత కాలంలో పాండవులు వారి వనవాస సమయంలో ఈ ప్రాంతంలో సంచరించారని, ఆ సమయంలో పాండవులకు నీటి సమస్య వచ్చింది. ఎక్కడా నీటి జాడ కనిపించలేదు. దీంతో ధర్మరాజు ఆదేశానుసారం భీముడు తన గదాఘాతంతో కొండ ప్రాంతంపై గట్టిగా కొట్టడంతో ఆ దెబ్బకు నీటి గుండాలు ఏర్పడ్డాయి. ఆ నీటి గుండాల్లోని నీటితో వారి అవసరాలు తీర్చుకుని వెళ్లిపోయారు. తరువాత కాలంలో ఆ నీటి గుండాల్లోని నీటిని ఆసరాగా చేసుకుని కొందరు జనాలు జీవనం సాగించేవారని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇలా ఏర్పడ్డ జన సమూహంతో అది గ్రామంగా మారింది. ఇలా భీముడి గదాఘాతానికి ఏర్పడ్డ గుండాల ద్వారా ఏర్పడిన గ్రామానికి భీమగుండంగా నామకరణం అయిందని గ్రామస్థులు తెలుపుతున్నారు. విచిత్రమేమంటే దశాబ్దాల కాలంలోనే భూగర్భజలాలు అడుగంటి బావులు బోర్లు ఎండిపోతున్న ఈ తరుణంలో భీమగుండంలోని నీటి గుండాలు అత్యంత తక్కువ లోతులోనే జలకళతో కనిపిస్తూ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. కొన్ని దశాబ్దాలుగా గ్రామస్థులు ఈ గుండాల్లోనే నీటిని ఉపయోగించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో నీటి సమస్య తలెత్తినప్పుడు వ్యవసాయ అవసరాల కోసం గుండాల్లో నీటిని ప్రజలు ఉపయోగిస్తున్నారు. ఈ గుండాల చుట్టూ రక్షణగా ప్రహరీలు నిర్మించారు. అయితే కొన్ని గుండాలకు ప్రహరీ లేకపోవడంతో చెత్త చెదారంతో నిండాయి. ఈ గుండాల్లో నీటిని తోడుకునేందుకు అనువుగా అప్పట్లో తాపలు కూడా ఏర్పాటు చేశారు. భీముడి పేరుతో ఏర్పడ్డ నీటి గుండాలు నేటికీ ఆ గ్రామస్థుల నీటి అవసరాలు తీర్చుతున్నాయి.

ఫిల్టరు నీళ్ల కంటే రుచిగా ఉంటాయి



పాండవుల కాలంలో ఈ నీటి గుండాలు ఏర్పడ్డాయని మా పెద్దలు చెబుతుంటారు. ఈ గుండాల్లో నీరు ఎంతో స్వచ్ఛంగా ఫిల్టర్ల నీటి కంటే రుచిగా ఉంటాయి. ఇప్పటికీ ఈ నీటిని ఉపయోగిస్తున్నాం. గ్రామంలో నీళ్ల సమస్య వస్తే అందరం నీటి గుండాలను ఆశ్రయించాల్సిందే. భీముడి గదతో కొట్టగా ఏర్పడ్డ గుండాల కారణంగా భీమగుండం గ్రామం పేరు వచ్చిందని మా పెద్దలు చెప్పేవారు.

-వెంకటేశ్వర్లు, భీమగుండం

వంతులవారీగా నీళ్లు తీసుకెళ్లేవారం



గ్రామంలో కుళాయిలు ఏర్పాటు కాక ముందు అందరం ఈ గుండాల నీటి వద్దకు వెళ్లి క్యూలైనులో నిలబడి వంతుల వారీగా కడవలు, బిందెలతో నీళ్లు ముంచుకుని తీసుకువచ్చేవారం. నీళ్లు చాలా స్వచ్ఛంగా ఉండేవి. ప్రస్తుతం కుళాయిలు, ఫిల్టరు నీళ్లు వచ్చాక గుండాల్లో నీటి వాడకం తగ్గింది. అయితే కుళాయి నీరు రాకపోతే ఈ గుండాల వద్దకే వెళ్లి నీరు తెచ్చుకుంటాం. వర్షాకాలంలో నీటి గుండాల్లో నీరు పొంగి వీధుల్లో పారుతాయి.

- సరస్వతి, భీమగుండం


గుండంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన తాపలు


గదతో కొట్టినట్లుగా కనిపిస్తున్న గుండం


గ్రామంలో ఉన్న అతి పెద్ద నీటి గుండం


నీటి గుండం చుట్టూ రక్షణ గోడ

'అన్నమాచార్య'లో వైభవంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి, డీఎస్పీ సుధాకర్, చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి
- 9న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రాక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చొప్పా గంగిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డీఎస్పీ సుధాకర్, విద్యార్థినుల నృత్య ప్రదర్శన

రాజంపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ విద్యాలయాలను ప్రారంభించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 3 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను మంగళవారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్, విద్యాసంస్థల అధినేత, అన్నమాచార్య యూనివర్శిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ సి.రామచంద్రారెడ్డి, ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట లాంటి చిన్న పట్టణంలో అన్నమాచార్య విద్యాలయాలను 25 ఏళ్ల కిందట ప్రారంభించి నేడు యూనివర్సిటీ స్థాయికి తీసుకురావడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. ఉత్తమ శిక్షణ, ఉన్నత విద్యా ప్రమాణాలే లక్ష్యంగా ఈ విద్యాలయాలను ప్రారంభించడం చాలా సంతోషదాయకమన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రఖ్యాత సంగీత కళాకారుడు రామ్ మిరియాల మ్యూజిక్ విద్యార్థులను ఎంతో అలరించింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ మల్లికార్జునరావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ జయరామిరెడ్డి, డీన్ సుబ్బారావు, సుమారు 4 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

9న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ రాక

అన్నమాచార్య యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఈనెల 9వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరవుతున్నట్లు యూనివర్శిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. అదేరోజు ఉత్సవాలకు ప్రముఖ హాస్యనటుడు కె.బ్రహ్మానందం హాజరవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌చౌదరి, తెలుగు సినిమా హీరో కిరణ్ అబ్బవరం హాజరవుతున్నట్లు తెలిపారు.

ఈ ఉత్సవాల్లో భాగంగా 8వ తేదీ బుధవారం సాయంత్రం జరిగే కార్యక్రమాలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, సతీష్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు వేలాదిమంది విద్యార్థులచే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రాజంపేట పట్టణంలో భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. ర్యాలీకి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఎస్టీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

మౌలిక వసతులకు పక్కాగా సర్వే చేయాలి : కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనులు, వారి నివాస ప్రాంతాల అభివృద్ధికి పక్కాగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం మంతన్ శివిర్‌లో భాగంగా జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో ధర్తీ అభా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద జిల్లా మంతన్ శివిర్ సమావేశం నిర్వహించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమం కింద గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు. 25 అంశాల్లో గిరిజనులు, వారి ప్రాంతాలను అభివృద్ధి చేయాలని 17 శాఖలకు నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ప్రతిశాఖ రాబోయే ఐదు సంవత్సరాల్లో షెడ్యూల్ తెగల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక కింద ఎస్టీలకు కేటాయించిన నిధుల ద్వారా నిర్దిష్ట కాల పరిమితిలో పథకాల అమలును పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు జిల్లాలో 50 శాతానికి పైబడి గిరిజనుల జనాభా ఉన్న పెనగలూరు, కోడూరు, లక్కిరెడ్డిపల్లె, కురబలకోట 4 మండలాల్లో 17 గ్రామాలు పథకాల సంతృప్త అమలుకు ఎంపిక చేయబడినట్లు పేర్కొన్నారు. నాలుగు మండలాల పరిధిలో గల 17 గ్రామాల్లోని సచివాలయాల్లో ఆయా పంచాయతీల వారీగా ఎస్టీ గృహాలు, వారి జనాభాను గుర్తించి రెండు రోజుల్లోగా పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సంక్షేమ అధికారిణి తేజస్విని, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్యం, డీఆర్‌డీఏ, డ్వామా, పంచాయతీ, ఐసీడీఎస్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంగోత్సవ్ పోటీలు విజయవంతం


ఉమ్మడి కడప జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీల విజేతలతో అధ్యాపకులు

రాయచోటిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉమ్మడి కడప జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, కళలు, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కార్యక్రమ కో-ఆర్డినేటర్ వైసీ రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ పోటీలు ఒక అద్భుతమైన వేదిక అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో హసీషా, డ్రాయింగ్‌లో ఎస్ఎండీ తౌసిఫ్, చేతిరాత పోటీలో భవ్యశ్రీ, రంగోళి పోటీల్లో ఐశ్వర్య, జానపద నృత్యంలో నాగనిషిత బృందం, డిజిటల్ కోల్లాజ్‌లో హర్షిత, స్లోగన్ రైటింగ్‌లో ప్రవళ్లిక, రోల్‌ప్లే పోటీలో చైతన్య విజేతలుగా నిలిచారు. ఈ పోటీలను మొత్తం 8 విభాగాల్లో నిర్వహించారు. ఒక్కో విభాగంలో మొదటి స్థానాన్ని పొందిన వారు జనవరి 24న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలకు డైట్ కళాశాల అధ్యాపకులు శివభాస్కర్, శ్రీదేవి, అసదుల్లా, నాగరాజు, నాగేశ్వరరావు, ప్రకాశ్‌రెడ్డిలు జడ్జిలుగా వ్యవహరించారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో ప్రోత్సహించడంలో ముఖ్యపాత్ర పోషించిన కో-ఆర్డినేటర్లు, నిర్వాహకులకు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రైల్వేకోడూరు క్రీడాకారులకు బ్యాడ్మింటన్‌లో మొదటి ర్యాంకు



రైల్వేకోడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ షటిల్ బాడ్మింటన్ (జూనియర్ విభాగం) పోటీల్లో రైల్వేకోడూరుకు చెందిన విద్యార్థులు గొబ్బూరు విశ్వతేజ్, అరిగిల భార్గవ్‌రాం మొదటి ర్యాంకు సాధించారు. మహారాష్ట్రలోని పూణెలో షటిల్ బాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత ఏడాది అక్టోబరులో అంతర్జాతీయ స్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈనెల 5న ఈ ఏడాదికి మొదటి ర్యాంకును బీడబ్ల్యూఎఫ్ (బాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్) ప్రకటించినట్లు విద్యార్థులు మంగళవారం మీడియాకు తెలిపారు. ఈ పోటీల్లో రెండు సార్లు మొదటి స్థానంలో నిలవడంతో ఈ ర్యాంకు లభించిందని వారు తెలిపారు.

బంగారు షాపు యజమానికి బురిడీ

- నకిలీ బంగారం ఇచ్చి... 22 గ్రాముల బంగారు నగలు పట్టుకెళ్లారు...
- సీసీ టీవీలో ఇద్దరు మహిళల గుర్తింపు


నకిలీ బంగారం ఇచ్చి మోసం చేసిన మహిళలు

రాజంపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నకిలీ బంగారంతో ఇద్దరు మహిళలు నగల వ్యాపారినే బురిడీ కొట్టించిన ఉదంతం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజంపేట పట్టణంలోని పాత పోలీసు లైనులో మహీద్‌ఖాన్ అనే వ్యక్తి బంగారు నగల దుకాణం నిర్వహిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం ఆయన దుకాణానికి వచ్చిన ఇద్దరు మహిళలు తమ వద్ద ఉన్న పాత నగలు ఇచ్చి వాటికి బదులుగా కొత్త నగలు కొనుగోలు చేశారు. వారు తెచ్చిన నగలపై హాల్‌మార్కు ఉండడంతో షాపు యజమాని జాగ్రత్తగా పరీక్షించకుండానే తీసుకున్నారు. సోమవారం ఆ నగలను కరిగించగా అది బంగారం కాదని తేలింది. దీంతో మోసపోయానని గ్రహించిన షాపు యజమాని సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులను ఆశ్రయించాడు. మంగళవారం రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కిలాడీ లేడీలు అపహరించిన బంగారు విలువ సుమారు 1.70 లక్షలు ఉంటుందన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- 108 వాహనం ఢీకొన్న ఘటనలో గాయపడి...


తులసమ్మ (ఫైల్)

రామసముద్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం గోవింద మాల వేసి కాలినడకన తిరుమలకు వెళ్తున్న భక్తులను సోమవారం ఉదయం తిరుపతి సమీపంలో 108 వాహనం ఢీకొన్న ఘటనలో గాయపడిన తులసమ్మ తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలు మండలంలోని మాలేనత్తం గ్రామ పంచాయతీ చింపరపల్లె గ్రామానికి చెందిన రమణారెడ్డి భార్య. సోమవారం 108 వాహనం ఢీకొన్న ఘటనలో తులసమ్మకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రిలో చేర్చారు. ఇదే ఘటనలో సోమవారం ఇద్దరు మహిళలు మృతి చెందిన విషయం విదితమే. కాగా మృతి చెందిన మహిళ దహనక్రియలు సోమవారం చింపరపల్లె, సింగంవారిపల్లెలో జరగ్గా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మృతి చెందిన ఒక్కొక్క మహిళ కుటుంబానికి రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రుణాలకు బ్యాంకర్లు సహకరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి అందించే రుణాలకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా బీసీ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ వివిధ బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు అందించే వివిధ రకాల రుణాలు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, తదితర వివరాలను కలెక్టర్‌కు, కమిటీ సభ్యులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లాకు రూ.34 కోట్లు బీసీ కార్పొరేషన్, ఈబీసీ, ఆర్థికంగా వెనుకబడిన కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు అందించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించిందని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలను పొందేందుకు లబ్ధిదారులు ఈనెల 8 నుంచి 16వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఎం ఆంజనేయులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు మృతి


మృతి చెందిన నరేశ్

మదనపల్లె అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు మృతి చెందిన సంఘటన బసినికొండలో జరిగింది. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె మండలం రామాచార్లపల్లెకు చెందిన పెయింటర్ నరేష్ (30) ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో అతను సంఘటనాస్థలంలోనే మృతి చెందాడు. నరేష్ మంగళవారం రాత్రి మదనపల్లె పట్టణంలోకి వెళ్లి పనిముగించుకుని తిరుగు ప్రయాణంలో రామాచార్లపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలో బసినికొండ శివాలయం వద్ద నిమ్మనపల్లె నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నరేష్ మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి శవ పరీక్ష కోసం తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ట్రిపుల్ ఐటీలో క్యాంటీన్ లేక...

- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- బయటి ఫుడ్ కోసం వెంపర్లాట
- రాజకీయ ఒత్తిడితో ముందుకు సాగని క్యాంటీన్‌ల ఏర్పాటు

వేంపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మూడు నెలలుగా విద్యార్థులు ఆహారం కోసం ఇబ్బంది పడుతున్నారు. క్యాంపస్‌లోని క్యాంటీన్లకు అలవాటుపడ్డ విద్యార్థులు అవి మూతపడడంతో బయట ఫుడ్ కోసం ఎగబడుతున్నారు. మెస్‌లలో ఆహారం అందిస్తున్నప్పటికీ మొదటి నుంచి క్యాంటీన్‌లోని ఆహారానికి అలవాటుపడ్డ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మూడు నెలలల క్రితం మూసివేశారు. కొత్తగా తిరిగి ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. అయితే మూడు నెలలు కావస్తున్నా క్యాంటీన్లు ఏర్పాటు కాలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఒక దశలో విద్యార్థులు ఆందోళన కూడా చేపట్టారు. సర్దిచెప్పిన అధికారులు బయటిఫుడ్ తెప్పించుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఈ బయట ఫుడ్ ద్వారా విద్యార్థులకు ఏదైనా సమస్య ఉత్పన్నమవుతుందేమోనని తల్లిదండ్రుల్లో ఆందోళన ఉంది. క్యాంపస్‌లో క్యాంటీన్లు లేకపోవడం వల్లే విద్యార్థులు బయటఫుడ్‌కు ఎగబడుతున్నారు. అధికారులు క్యాంటీన్లు ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

రాజకీయ ఒత్తిళ్లే కారణమా...

ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్ల ఏర్పాటులో రాజకీయ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. గత ప్రభుత్వంలో ఏర్పాటైన క్యాంటీన్లు రద్దయ్యాయి. కూటమి ప్రభుత్వంలోని రెండు వర్గాలు, వైసీపీ వారు క్యాంటీన్ల ఏర్పాటు విషయంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్త, జిల్లా కలెక్టర్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరికి ఎంత కేటాయించాలనే విషయంపై ట్రిపుల్‌ఐటీ అధికారులకు తలనొప్పి వ్యవహారంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. ఎవరికి వారు తమకే కావాలంటూ ఆరు పార్టీల నేతలు పట్టుబడుతున్నారు. దీంతో క్యాంటీన్ల ఏర్పాటులో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ట్రిపుల్‌ఐటీ అధికారులు ఏదొక నిర్ణయం తీసుకొని వెంటనే క్యాంటీన్లను ఏర్పాటు చేయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



ట్రిపుల్‌ఐటీ ముఖద్వారం

డైరెక్టర్ ఏమన్నారంటే..

క్యాంటీన్ల ఏర్పాటు జాప్యంపై డైరెక్టర్ కుమారస్వామి గుప్తను అడగ్గా.. త్వరలోనే క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని అందుకు తగ్గ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత కొద్ది వారాలుగా డైరెక్టర్ ఇదే విషయాన్ని చెబుతున్నారు. అయితే ఆచరణలో క్యాంటీన్లు ఏర్పాటు కావడం లేదు. ఎప్పుడు ఏర్పాటు చేస్తారో తెలియని పరిస్థితి ఉంది.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- మహాధర్నాలో నినదించిన అంగన్వాడీలు


కడప కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో అంగన్వాడీలు, సంఘాల నాయకులు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని అంగన్వాడీలు నినదించారు. మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మంజుల, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా డిప్యూటీ సెక్రటరీ బాదుల్లాలు మాట్లాడుతూ పనిభారం పెంచుతూ, నిత్యం నిత్యావసర సరుకులు ధరలు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచుతున్నా వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, విధులలో చనిపోయిన వారికి రూ.5లక్షలు ఇవ్వాలని, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. గ్రాట్యుటీ వెంటనే అమలు చేయాలని, గౌరవ వేతనాలు బిల్లులు ప్రతినెల 5వ తేదీలోపు చెల్లించాలన్నారు. సంక్షేమ పథకాలు అంగన్వాడీ టీచర్లకు హెల్పర్లకు అందరికీ వర్తింపజేయాలన్నారు. కాగా, కడప నగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టి మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, నాయకులు విజయ, సుజాతమ్మ, యశోద, శ్రీదేవి, ప్రసన్న, పార్వతి, రజని, శివనారాయణమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేట్ సైబర్ టెక్ సొల్యూషన్స్‌తో వైవీయూ ఒప్పందం


ఒప్పంద పత్రాలతో వీసీ కృష్ణారెడ్డి, సీఈఓ తదితరులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్నోవేట్ సైబర్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో (హైదరాబాద్) పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఆ సంస్థ సీఈఓ మోనిక, ఎండీ అభిమన్యు రావు, ప్రోగ్రాం డెవలపర్ మండూరు అయ్యప్ప, యోగివేమన యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్‌రెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వివిధ ప్రముఖ సంస్థలకు, పరిశ్రమలకు మానవ వనరులను అందించే సైబర్ టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమ విద్యార్థులను నైపుణ్యత గల వారీగా తయారు చేస్తారని తెలిపారు. అలానే ఉద్యోగ అవకాశాలకు ప్రమోట్ చేస్తారని వివరించారు. సీఈఓ మౌనిక మాట్లాడుతూ రెండేళ్ల పాటు ప్లేస్‌మెంట్ శిక్షణలు, ఇంటర్న్‌షిప్‌లు ప్లేస్‌మెంట్‌లను అందించడంలో సహాయపడుతామన్నారు. ఇఫిషియల్ ఇంటలిజెంట్, సెయిల్ పాయింట్, సైబర్‌ఆర్క్, ఒరాకిల్, హెచ్‌సీఎం, శాప్ ఏఐ, శాప్ ఎండీజీ, మెషిన్ లర్నింగ్, డేటా సైన్స్, పైథాన్ జాంగో, శాప్ ఇంటోన్, ఫుల్‌స్టాక్ పైతాన్, వెబ్ డెవలెంట్, బ్లాక్ చైన్ డెవలప్‌మెంట్, క్లౌడ్ కంప్యూట్ మొదలైన కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో ప్రజా సంబంధాల విభాగం సచాలకులు డాక్టర్ పి.సరిత పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తాం

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుబ్బారెడ్డి


విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు, రైతులు

చెన్నూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి రైతు తాను సాగు చేసే పంటలో అధిక దిగుబడులు సాధించి లాభపడేందుకు నాణ్యమైన విత్తనాలు అందిస్తామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరపు సుబ్బారెడ్డి అన్నారు. కడప నగరానికి వచ్చిన ఆయనను మంగళవారం చెన్నూరుకు చెందిన పలువురు రైతులు, టీడీపీ నేతలు కలిసి రైతుల శ్రేయస్సు కోసం నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ప్రతి రైతు బాగుపడాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. సీఎం చంద్రబాబు ప్రతి రైతు కోసం ఎంతో తపిస్తున్నాడని.. రైతు బాగున్నప్పుడు రాష్ట్రం బాగుంటుందన్న ఉద్దేశ్యంతో ఇప్పటి నుంచే విత్తనాభివృద్ధి సంస్థను ముందుకు తీసుకెళ్లి అన్ని గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. గత ప్రభుత్వంలో విత్తనాభివృద్ధి సంస్థ పరంగా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ముఖ్యంగా రైతు సాగులో ఖర్చులు తగ్గించుకునేందుకు రైతు భరోసా రూ.20వేలకు పెంచి ఇవ్వబోతున్నట్లు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, ఐ.శివారెడ్డి, కె.విజయభాస్కర్‌రెడ్డి, రైతు నేతలు వెంకటసుబ్బయ్య, కుంచెం రామక్రిష్ణరెడ్డి, ముండ్లపల్లె శ్రీనివాసులరెడ్డి, హనుమంతురెడ్డి, ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, సంజీవరాయుడు, శివయ్య, శివారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉమూమి తబ్లిగీ ఇజితెమా

- భారీగా తరలివచ్చిన ముస్లింలు


ఆధ్యాత్మిక బోధనలు చేస్తున్న ఉలేమాలు

ఆత్మకూరు, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): నంద్యాల జిల్లా ఆత్మ కూరు కేంద్రంగా మూడు రోజుల పాటు జరగనున్న ఉమూమి తబ్లిగీ ఇజితెమా మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీశై లం రస్తాలోని సుమారు వంద ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇజితెమా ప్రాంగణానికి కర్నూ లు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వేలాది మంది ముస్లింలు తరలివచ్చారు. మధ్యాహ్నం ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా హాజరైన ఉలేమాలు ఆధ్మాత్మిక ప్రవచనాలను, మహ్మద్ ప్రవక్త నిర్ధేశించిన మార్గదర్శకాలను వినిపించారు. తొలిరోజు మధ్యాహ్నం, సాయం త్రం, రాత్రి వేళల్లో ముస్లింలు ప్రార్థనలు చేపట్టారు. ఇదిలావుంటే వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికోసం ఇజితెమా నిర్వహణ కమిటీ భారీ ఏర్పాట్లను సిద్ధం చేసింది. వంద ఎకరాల్లో ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేయడంతో పాటు నమాజులు చేసుకునేందుకు వీలుగా సదుపాయాలను కల్పించారు. అలాగే విద్యుద్దీకరణతో పాటు భారీ ఫ్లడ్‌లైట్లను అమర్చారు. అదే క్రమంలో సుమారు 5వేల మరుగుదొడ్లు, స్నానపుగదులు, 17భోజన కౌంటర్లను ఏర్పాటు చేశారు. అలాగే ఆయా రూట్లలో 18చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పా టు చేసి ట్రాఫిక్‌జామ్ సమస్య వాటిల్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో బస్టాండ్‌కు చేరుకున్న వారికి ప్రత్యేక వాహనాల్లో ఇజితెమా ప్రదేశానికి తరలించే ఏర్పాట్లు కల్పించారు. కాగా మంగళవారం రాత్రికి ఇజితెమా ప్రాంతానికి అధిక సంఖ్యలో ముస్లింలు తరలి వచ్చారు. బుధవారం ఉదయం నుంచి భారీ స్థాయిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వహణ కమిటీ సభ్యులు వెల్లడించారు.

వరుస విజయాలతో.. సత్తా చాటిన కడప జట్టు

- మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు విజయకేతనం

కడప స్పోర్ట్స్ జనవరి 7, (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్- 12 బాలుర అంతర్ జిల్లాల సౌత్‌జోన్ క్రికెట్ పోటీలలో కడప జట్టు వరుసగా రెండో విజయం సాధించి సత్తా చాటింది. అలాగే నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో గెలు పొందింది. వివరాలిలా.. నగర శివారు ప్రాంత కేఓఆర్‌ఎం మైదానంలో కడప- చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేపట్టింది. నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. ఇందులో భువన్ సాయి 54 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు కేవలం 25.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో తాహీర్ 35, యోగాంజనేయులు 32, విష్ణువర్ధన్‌రెడ్డి 31 పరుగులు చేశారు. దీంతో కడప జట్టు 7 వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని ఖాతాలో వేసుకుంది.


ఏసీఏ క్రికెట్ స్టేడియంలో తలపడుతున్న నెల్లూరు- కర్నూలు జట్లు



భువన్‌సాయి (54 పరుగులు), జాన్‌సన్ (53 పరుగులు)

కర్నూలుపై నెల్లూరు జట్టు గెలుపు

రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు- కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి విజయానికి అవసరమైన 141 పరుగులు చేసింది. ఇందులో జాన్‌సన్ 53 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది.

పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలి

కడప మారుతీనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గోదావరి, పెన్నా నదులను అనుసంధానం చేయాలని సంకల్పించడం హాస్యాస్పదంగా వుందన్నారు. వెనుకబడిన ప్రాంతం రాయలసీమలో పెండింగ్‌లో వున్న హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ, వెలుగొండ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నదుల అనుసంధానం ప్రక్రియ చేపట్టాలని భావించడం అవివేకమన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, నదుల అనుసంధానం అనే అంశంపై మంగళవారం అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొదట పెండింగ్‌లో వున్న 55 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి 33 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నారు. గోదావరి-కృష్ణ-పెన్నా నదుల అనుసంధానం పేరుతో 80వేల కోట్లతో ప్రభుత్వం పథకం రూపొందించి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కొరకు నిధుల సాయానికి పంపుతున్నట్లు ప్రకటించారు. ఈ పథకం ద్వారా 385 టీఎంసీల నీటిని కృష్ణకు మళ్లించి రాయలసీమ నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం చెబుతున్న తీరు విడ్డూరంగా వుందన్నారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు సమావేశంలో నాయకులు నారాయణరెడ్డి, సత్తార్, గుర్రప్ప, అంజి, శంకర్, సుబ్బరాయుడు, దేవర శ్రీకృష్ణ, జయవర్ధన్, రామయ్య, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

పకడ్బందీగా పోలీసు నియామక పరీక్షలు

కడప క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీసునియామక ప్రక్రియలో భాగంగా కడప ఉమ్మడి జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో దేహదారుఢ్య పరీక్షలను 7వ రోజు మంగళవారం ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుకానిస్టేబుల్ ప్రిలిమనరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులకు ఉమ్మడి కడప జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. 7వ రోజు మంగళవారం 600 మంది అభ్యర్థులకు 442 మంది పరీక్షలకు హాజరయ్యారు. 274 మంది క్వాలిఫై అయ్యారు. ప్రతిరోజూ అభ్యర్థులకు మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలన, ఎత్తు, ఛాతివంటి ఫిజికల్ మెజర్‌మెంట్స్ చేస్తారు. తరువాత బయోమెట్రిక్ తీసుకుంటారు. దేహదారుఢ్యపరీక్షల్లో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దేహదారుఢ్య పరీక్షల వద్ద ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక ఆర్‌ఎఫ్ఐడీ కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటీ కోర్ టీం, డీపీవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



పరుగును పరిశీలిస్తున్న ఎస్పీ, అదనపు ఎస్పీ, పరిగెడుతున్న అభ్యర్థులు

ఇంత నిర్లక్ష్యమా..

- పూడిక తీశారు.. పై కప్పు మరిచారు
- కాలువలో పడిపోయిన మహిళ
- బద్వేలు మున్సిపాలిటీ తీరుపై స్థానికుల ఆగ్రహం

బద్వేలు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఈ సంఘటన నిలుస్తోంది పట్టణపరిధిలోని స్థానిక నెల్లూరు రోడ్డు ప్రధాన రహదారిలో గల ఓ కేఫ్ ముందు భాగంలోని కాలువలో మున్సిపల్ సిబ్బంది పూడికతీత పనులు చేశారు. తిరిగి కాలువలకు పైకప్పు వేయకపోవడంతో ఓ మహిళ ఆ కాలువలో పడి గాయ పడింది. ఈ దృశ్యాలు అక్కడి సీసీ పుటేజ్‌లో రికార్డు కావడం.. ఇది సోషియల్ మీడియాలో వైరల్ కావడంతో పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారుల, సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద కాలువలో పూడికతీసి వదిలేయడంతో వాహనాలు కాలువలో ఇరుక్కుపోతున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువల్లో పూడికతీసిన మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ కొరవడ టంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



'డబ్బుకోసం మనవడే హతమార్చాడు'

'డబ్బుకోసం మనవడే హతమార్చాడు'

మైదుకూరు రూరల్, జనవ రి 7 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లెకు చెందిన అల్లాడుపల్లె వీరారెడ్డి (75) గత నెల ఆరవ తేదీ మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే జనవరి 2వ తేదీ వీరారెడ్డి రెండవ భార్య కుమారుడు కుమ్మరి రమేష్ మా నాన్నది సహజ మరణం కాదని విచారణ చేపట్టాలని మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు ఈనెల 4వ తేదీ ఉన్నతాధికారుల సమక్షంలో మృతుడు వీరారెడ్డి శవానికి పోస్టుమార్టం నిర్వహించారు. విచారణలో భాగంగా శెట్టివారిపల్లెలోని ఓ సీసీ కెమెరాలో రికార్డు అయిన ఫుటేజ్ ప్రకారం వీరారెడ్డి మనవడైన అల్లాడుపల్లె హరినాథ్‌రెడ్డి, అతని స్నేహితుడు కాలువపల్లి నరసిహులు ఇద్దరు కలిసి డబ్బుల కోసమే వీరారెడ్డిని చంపినట్లు విచారణ తేలిందని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు మంగళవారం కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

పర్యావరణానికి ప్రథమ శత్రువు ప్లాస్టిక్

- ఏపీఎన్‌జీసీ ఇన్‌చార్జి డైరెక్టర్ పి.స్రవంతి

కడప ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ప్రథమ శత్రువు ప్లాస్టిక్ అని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ క్రాఫ్ట్ ఇన్‌చార్జి డైరెక్టర్ పి.స్రవంతి (ఐపీఎస్) తెలిపారు. మంగళవారం కడప నగరం బాలవికాస్, నాగార్జున మోడల్ స్కూల్ పాఠశాలల్లో విద్యార్థులతో ఇంటరాక్షన్ అయ్యారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణం గొప్పతనాన్ని, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో ఒక మొక్కను దత్తకు తీసుకోవడం వల్ల ఆ మొక్క మానుగా మారి పర్యావరణానికి నాంది పలుకుతుందన్నారు. అనంతర నాగార్జున మోడల్ స్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో ఎన్‌జీసీ (నేషనల్ గ్రీన్ క్రాఫ్స్) విశిష్టతను వివరించారు. ఏపీఎన్జీసీ పీఓ సత్యనారాయణ, కడప మండల వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు పెరుగుతాయని మోసగింపు

ముద్దనూరు జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కంపెనీ అభివృద్ధి చెందితే.. జీతాలు పెరుగుతాయంటూ కంపెనీ యాజమాన్యం మోసగించి డబ్బులు వసూలు చేసిందని మంగళవారం మంగపట్నం గ్రామానికి చెందిన రాళ్లపల్లి మంజునాథ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు వివరాలు.. మంగపట్నం గ్రామానికి చెందిన మంజునాథ బెంగళూరులోని ఈడీ వేదా ఎడ్యుకేషన్ కంపెనీలో అకౌంట్ సెక్షన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆ కంపెనీకి చెందిన యాజమాన్యం సాయిచరణ్ అతని భార్య రేష్మ కంపెనీ అభివృద్ధి చెందితే అందరికీ జీతాలు పెరుగుతాయని మోసగించారు. మంజునాథ వద్ద నుంచి రూ.10,62,620 తీసుకొని మోసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా అకడమిక్ ఒడిస్సీ కాంపిటీషన్ వేడుకలు



విద్యార్థికి సర్టిఫికెట్, మెమెంటో అందిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి, పాఠశాల వైస్ చైర్మన్ సాయిసుధీర్ కుమార్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్కాయపల్లె సాయిబాబా పాఠశాలలో మంగళవారం అకడమిక్ ఒడిస్సీ వేడుకలు నిర్వహించారు. 46వ డివిజన్ కార్పొరేటర్, పాఠశాల సీఈఓ ఎం.వి. శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి కొత్త ఆవిష్కరణల దిశగా సంసిద్ధులను చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.అలాగే పాఠశాల వైస్ చైర్మన్ ఎ.వి. సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాలానుగుణంగా కొత్త సాంకేతిక విధానాలను అవలంబిస్తూ విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించాలనేదే ఈ అకడమిక్ ఒడిస్సీ ప్రోగ్రామ్ ఉద్దేశమన్నారు. అనంతరం విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు మెమెంటోలు అందజేశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంపౌండ్ వాల్‌కు అనుమతివ్వాలని జేసీకి వినతి

కడప కలెక్టరేట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పెద్దమ్మ తల్లికి చెందిన 3.09 ఎకరాల్లో కాంపౌండ్ గోడ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతివ్వాలని జేసీ అదితిసింగ్‌కు ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తివాసులు వరప్రసాద్ రెడ్డి, శివారెడ్డి మంగళవారం వినతి పత్రం అందజేశారు. 3.09ఎకరాల భూమి దేవదాయ శాఖలో ఉంది. అందులో సగం భూమి అన్యాకాంతమైందన్నారు. ఆ స్థలంలో రాజ్యసభ సభ్యుడు కాంపౌండ్ వాల్, పార్కు, జిమ్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.95 లక్షల నిధులతో పనులు ప్రారంభించడం పెద్దమ్మ తల్లి భక్తులకు ఆవేదనకు గురి చేసిందని తెలపగా జేసీ సానుకూలంగా స్పందించారన్నారు.

కార్యదర్శుల సంఘం ఏర్పాటు



పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడికి నియామక పత్రం అందిస్తున్న ఎంపీడీఓ

చెన్నూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రేడ్-1 పంచాయతీ నుంచి గ్రేడ్-6 వరకు ఉన్న పంచాయతీ కార్యదర్శుల సంఘాన్ని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. పది గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయంలో హాజరై అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎంపిక చేశారు. మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా ఉప్పరపల్లె కార్యదర్శి షేక్ అన్వర్‌బాషా, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ప్రసాదరెడ్డి, కోశాధికారిగా షేక్ గౌస్‌బాషా, మహిళా కార్యదర్శిగా ఎల్.సుప్రియారెడ్డి కార్యవర్గంగా ఏర్పాటయ్యా రు. ఎంపికైన వారికి ఎంపీడీవో నియామక పత్రాలను అందించారు.

గండిరోడ్డు వెడల్పు పనులు ఉన్నట్లా.. లేనట్లా?

- నాలుగుశాతం పూర్తైనట్లు ఆర్‌అండ్‌బీ నివేదిక
- రద్దుచేసిన జాబితాలో రోడ్డు
- రూ.9కోట్ల పనులు రద్దేనా
- రూ.18.50 కోట్ల పరిహారం పంపిణీ
- ప్రశ్నార్థకంగా గండి రోడ్డు వెడల్పు పనులు



వేంపల్లె- గండిరోడ్డులో మురుగు కాల్వలు, రోడ్డు ఏర్పాటు చేయని దృశ్యం

వేంపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం ఐదు మండలాలకు కేంద్రం. నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రజలు తిరుగుతుంటారు. వేంపల్లె పట్టణంలోని గండిరోడ్డున ప్రజలు ఎప్పుడూ ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులుపడేవారు. ఆ రోడ్డును వెడల్పుచేసి సుందరీకరిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వంలో కడప-పులివెందుల రోడ్డుతో పాటు గండిరోడ్డుకు పనులు మంజూరు చేశారు. ఎన్నికలు రావడంతో రోడ్డు, మురుగు కాల్వ పనులను నిలిపివేశారు. కడప- పులివెందుల రోడ్డుకు సంబంధించి 27శాతం పనులు పూర్తైనట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. అయితే గండిరోడ్డు పనులు మాత్రం 4 శాతం మేర జరిగినట్లు నివేదిక పంపారు. దీంతో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం 25 శాతంలోపు పనులు పూర్తికాని వాటిని రద్దు చేస్తూ జీఓ జారీ చేసింది. ఆ జీవో పరిధిలోకి గండి రోడ్డు ను కూడా చేర్చారు. దీంతో గండిరోడ్డు వెడల్పు పనులు ప్రశ్నార్థకంగా మారాయి. ఆ ప్రాంతంలో ఎవరిని కదిలించినా అసలు ఈ పనులు ఉన్నాయా రద్దయ్యాయా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

రూ.18.50 కోట్లు పరిహారం ఇచ్చారు

నాలుగురోడ్ల కూడలి నుంచి గండిరోడ్డు ప్రారంభమై రాయచోటి బైపాస్‌రోడ్డులోని పెట్రోల్ బంకు వరకు సుమారు 875 మీటర్ల మేర సిమెంటు రోడ్డు ఏర్పాటు చేసి రెండు వైపులా మురుగుకాల్వలు, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్ నిర్మించేందుకు రూ.9కోట్లు మంజూరైంది. గండిరోడ్డులో చేసిన పనులు మసీదు కాంప్లెక్స్ వైపు నుంచి చింతలమడుగుపల్లె రహదారి వరకు ఒకవైపున మాత్రమే మురుగుకాల్వ నిర్మించారు. అక్కడక్కడా ఇంకా పెండింగ్ ఉన్నాయి. ఇక రెండోవైపు మురుగు కాల్వతో పాటు సిమెంటురోడ్డు ఏర్పాటుచేయాల్సి ఉంది. ఈ ప్రకారం నాలుగుశాతం పనులు మాత్రమే అదీ మురుగుకాల్వ నిర్మాణం చేపట్టారని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే రోడ్డు వెడల్పు కోసం ఇరుపక్కలా ఉన్న ఇళ్ల యజమానులకు పరిహారం కింద ఇప్పటికే రూ.18.50కోట్లు అందజేశారు. ఇక పనులు నాలుగు శాతం అనగా రూ.50లక్షల మేర జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రకారం ఆ రోడ్డుకు రూ.19కోట్లు ఖర్చుచేశారు. మిగిలిన రూ.8.50 కోట్ల పనులు చేయాల్సి ఉంది. ప్రభుత్వం వచ్చిన జీఓ ప్రకారం గండిరోడ్డు వెడల్పు ప్రకారం రద్దైన జాబితాలో చేరింది. ఈ పనులను తిరిగి ప్రారంభించుకోవాలంటే ఫైనాన్స్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. మొత్తం ఖర్చును పరిగణలోకి తీసుకొని గండిరోడ్డు పనులు తిరిగి ప్రారంభించేలా కూటమి నాయకులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం అవస్థలు పడుతున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని త్వరగా పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.





గండిరోడ్డులో కొంత మేరకే మురుగు కాల్వ నిర్మాణం... శ్రీరామ్‌నగర్ గుట్ట వద్ద చేపట్టని రోడ్డు, మురుగు కాల్వ పనులు

ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం

గండిరోడ్డుకు సంబంధించి నాలుగు శాతం మేర పనులు జరిగినట్లు ప్రభుత్వానికి నివేదిక పంపిన విషయం వాస్తవమే. ఆ రోడ్డులో నిత్యం వాహనాలు, ప్రజలు తిరుగుతుంటారు. రోడ్డు, మురుగు కాల్వల అవసరం ఉందని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి గండి రోడ్డు పనులు అవసరమని ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- ఎన్.కె.మాధవి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్‌అండ్‌బీ, పులివెందుల

145 జీవోను నిలుపుదల చేయాలని సీఎంకు వినతి

కడప రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : కక్షిదారులను ఇబ్బందులకు గురిచేసే 145 జీవోను నిలుపుదల చేసేలా తగు చర్యలు తీసుకోవాలని సీఎం నారా చంద్రబాబునాయుడిని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు కోరారు. మంగళవారం కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబును తనతోపాటు సీనియర్ న్యాయవాది పి. జయరామిరెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, కల్చరల్ అండ్ స్పోర్ట్స్ సెక్రటరీ నంద్యాల చెన్నయ్యతో కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ఇందుకు నిరసనగా కడపలో న్యాయవాదుల రిలేనిరాహార దీక్షలను కొనసాగిస్తున్నట్లు సీఎంకు తెలియజేశామన్నారు. 145 జీవో కారణంగా ఏసీబీ, రెడ్‌శాండిల్, ఎన్‌డీపీఎస్ కోర్టులు తిరుపతికి వెళ్లిపోతే కక్షిదారులు, న్యాయవాదులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. సీఎం సాగుకూలంగా స్పందించి పరిశీలిస్తామన్నారని పేర్కొన్నారు.

ఆరుద్ర సాహిత్య ప్రస్థానం చిరస్మరణీయం

కడప ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆరుద్ర సాహిత్య ప్రస్థానం చిరస్మరణీయమని వైవీయూ తెలుగు శాఖ ఆచార్యులు ఎన్.ఈశ్వరరెడ్డి అన్నారు. వియవాడలో జరుగుతున్న పుస్తక మహోత్సవ కార్యక్రమంలో ఆరుద్ర జీవితం సాహిత్యంపై ఈశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఆరుద్ర చిన్నపటటి నుంచే ప్రగతిశీల భావాలతో రచనలు చేయడం ప్రారంభించారని గుర్తు చేశారు.

కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలి

పులివెందుల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల అధ్యాపకుడు నజ్మా, డాక్టర్ సాయిశ్రీనివాస్ సలహా ఇచ్చారు. మంగళవారం పులివెందుల పరిధిలోని బ్రాహ్మణపల్లెలో ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. 4వ రోజు చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో కిచెన్ గార్డెన్ తయారు చేశారు. పాలకూర, గోంగూర, తోటకూర, బెండకాయ, చిక్కుడు, గోరుచిక్కుడు, కాకరకాయ, ముల్లంగి విత్తనాలను నాటారు. రాగి, జొన్నలు, ఇతర చిరుధాన్యాలతో కేక్‌లను తయారు చేసే విధానాన్ని స్వయంగా తయారు చేసి చూపించారు.

అభయాంజనేయ స్వామికి ఘనంగా పూజలు

వేముల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగొందిపల్లెలో అభయాంజనేయస్వామి ఆలయలో స్వామివారికి ఘనంగా పూజలు చేశారు. గ్రామంలో స్వామిని ప్రతిష్ఠించి 40రోజులు భక్తిశ్రద్దలతో కఠినమైన దీక్షను పూర్తిచేసుకొని 41వ రోజు సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గడియారం కిరణ్‌కుమార్ శర్మచే స్వామివారికి అభిషేకం, హోమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి కుటుంబ సమేతగా పాల్గొని పూజలు చేశారు.

కేశవరావును కలిసిన తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు కేశవరావును హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి, సతీమణి అలిమేలు కలిశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రాజకీయాల గురించి కాసేపు చర్చించినట్లు తెలిపారు.

వార్ మెమోరియల్ స్థూపాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి

కడప మారుతీనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వార్ మెమోరియల్ స్థూపాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని సైనిక సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కె.వి.రావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంబంధిత శాఖ అధికారి ఎం.డి. రజాక్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు పుల్లయ్య నాయుడు, కె. ఓబులేసు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు

సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయండి

కడప కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా శిల్పారామంలో ఈనెల 11వ తేదీ నుంచి 15 వరకు తలపెట్టిన సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని పరిపాలనాధికారి పి. శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక స్టేట్‌గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మా ట్లాడారు. 11న ఉదయం 10 గంటలకు మహిళలకు చుక్కల ముగ్గుల పోటీలు, 12, 13న సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న గాలిపటాల ఉత్సవాలు, గంగిరెద్దుల ఆటలు, 15న జబర్దస్థ్ మించిన కామెడీ స్కిట్లు ఉన్నాయన్నారు.

విజయదుర్గాదేవి సన్నిధిలో రాహుకాల పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న మహిళలు(ఇన్‌సెట్) అలంకరణలో విజయదుర్గాదేవి

కడప కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం విజయదుర్గాదేవి సన్నిధిలో మహిళలు మంగళవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు చేశారు. వేకువజామునే పంచామృత అభిషేకం చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. ఈనెల 12న రెండవ ఆదివారం సందర్భంగా విజయదుర్గా సమేత మల్లికార్జున స్వామి వారి శాంతి కళ్యాణం, 13న సోమవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, చండీహోమం జరుగనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు.

ఘనంగా కందుల రాజేశ్వరమ్మ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కేఎస్ఆర్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ

సికెదిన్నె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ 70వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల వైస్ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కేక్ కట్‌చేసి పంచి పె ట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కే.శే.కందుల శివానందరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తున్నారన్నారు. రాజేశ్వరమ్మ ఇటువంటి జన్మదినాలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు.ప్రిన్సిపాల్ వీ.ఎస్.ఎస్. మూర్తి, బోధన, బోధనేతర సిబ్బంది ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కమలాపురం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం దేవరాజుపల్లె, పెద్దచెప్పలి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారిణి సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక శాతం లాభాలు వస్తాయన్నారు.

దివ్యాంగులకు దుస్తులు పంపిణీ

పులివెందుల రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జేఎన్టీయూ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. అంధుల లిపి ప్రదాత లూయిబ్రెయిలీ స్మారకోత్సవాలను పురస్కరించుకొని జేఎన్టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విష్ణువర్దన్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ మురళి పాల్గొన్నారు.

రుణాల మంజూరు అభినందనీయం

వేంపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బ్రాహ్మణుల ఆర్థిక స్వాలంబన కోసం ప్రభుత్వం రూ.22లక్షల మేర 9 యూనిట్ల రుణాలు మంజూరు చేయడం అభినందనీయమని జిల్లా బారహ్మణ ఐక్య వేదిక అధ్యక్షులు ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయక సంఘంలో ఉన్న మహిళలకు ఒక్కో యూనిట్‌కు 50 శాతం రుణం ఇచ్చారన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 74 మందికి 50శాతం సబ్సిడీతో రూ.28లక్షల మేర రుణాలు ఇవ్వాలని అధికారులలు నిర్ణయించడం మంచి పరిణామమన్నారు. ఈనెల 16వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థిని మృతికి వైవీయూ నివాళి

కడప ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ హెచ్ఆర్ఏ కోర్సు మూడో సెమిస్టర్ చదువుతున్న వెంకట పద్మావతికి వైవీయూ నివాళులర్పించింది. సోమవారం రాజుపాలెం మండలం వెంకయ్యపల్లెలో ఆమె అనారోగ్యంతో కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. వీసీ ఆచార్య కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పి.పద్మ తదితరులు ఆమె ఆత్మశాంతికి మౌనం పాటించారు. విశ్వవిద్యాలయానికి సెలవు ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, కడప. డి.నెం.72/272-5-18, 1వ అంతస్తు, కర్నూలు- చిత్తూరు ఎన్‌హెచ్40 రోడ్డు, వినాయకనగర్ సర్కిల్ దగ్గర, కడప, వైయస్.ఆర్. జిల్లా- 516003.ఫోన్: 08562-244594, ఈమెయిల్: rokdp-ee1@appcb.gov.in

LiFE Lifestyle for Environment

ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

భారత ప్రభుత్వ పర్యావరణము, అడవులు & వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వారి ఇ.ఐ.ఎ. ప్రకటన ఎస్.ఓ.1533, తేది: 14.09.2006 మరియు తదుపరి సర్క్యులర్స్ ప్రకారం, **"చిన్నపుత్త ఇసుక రీచ్ (పాపాఘ్ని నది) పేరున రాయల్టీ ఇన్‌స్పెక్టర్, వైయస్‌ఆర్ జిల్లా వారు సుమారు 22 లక్షల వ్యయంతో సర్వే నెం.87, చిన్నపుత్త గ్రామం, వల్లూరు మండలం, వైయస్‌ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో 20 హెక్టార్ల విస్తీర్ణంలో సాలీన 2,00,000 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం** గల సాధారణ ఇసుక త్రవ్వకం కొరకు ప్రతిపాదించిన ప్రాజెక్ట్‌కు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించుట గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, కడప జిల్లా వారు జారీ చేయు ప్రకటన.

ప్రాజెక్ట్ వివరాలు ఈ క్రింది విధముగా ఉన్నాయి:

1. కంపెనీ పేరు, టెలిఫోన్ నెం. మరియు చిరునామా	20 హెక్టార్ల చిన్నపుత్త ఇసుక రీచ్ (పాపాఘ్ని నది) సాధారణ ఇసుక గని త్రవ్వకం, సర్వే నెం.87, చిన్నపుత్త గ్రామం, వల్లూరు మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా, సెల్:9000380461, ఈమెయిల్:dmgokadapa@gmail.com
2. ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రదేశం & భూమి విస్తీర్ణం	సర్వే నెం.87, చిన్నపుత్త గ్రామం, వల్లూరు మండలం, వై.యస్.ఆర్.కడప జిల్లా, గని లీజు యొక్క మొత్తం విస్తీర్ణం: 20 హెక్టార్లు
3. సంప్రదించవలసిన అధికారి పేరు, చిరునామా మరియు టెలిఫోన్ నెంబరు	శ్రీమతి వై.రాధ, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జిల్లా మైన్స్ & జియాలజీ కార్యాలయం, వై.యస్.ఆర్.కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్- 516001 సెల్:9000380461,ఈమెయిల్:dmgokadapa@gmail.com
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ.22 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాలు	సాధారణ ఇసుక తవ్వకం
6.ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 07.02.2025 సమయం : ఉ.11.00 గం॥లకు ప్రదేశం : "గ్రామ సచివాలయం దగ్గర", పైడికాలువ (గ్రామం), వల్లూరు (మండలం), వై.యస్.ఆర్.జిల్లా.

7. ప్రతిపాదిత ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరములు సదరు ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సమ్మరీ (తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ EIA/EMP రిపోర్టు ప్రజల సౌకర్యార్థం ఈ క్రింద కార్యాలయములలో లభ్యపరచబడినది.
   - i. జిల్లా కలెక్టరు & జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, కడప, వైయస్.ఆర్. జిల్లా .
   - ii. ముఖ్య కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము, జిల్లా పరిషత్, కడప, వై.యస్.ఆర్. జిల్లా .
   - iii. జనరల్ మేనేజర్ వారి కార్యాలయము, జిల్లా పరిశ్రమల కేంద్రం, కడప, వై.యస్.ఆర్. జిల్లా
   - iv. MoEF & CC, GoI వారి కార్యాలయము, ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్ (ఐఆర్‌ఓ), పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
   - v. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, క్షేత్రీయ కార్యాలయము, వెంకటరమణ కాలనీ, కర్నూలు.
   - vi. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కడప, వై.యస్.ఆర్.జిల్లా .
   - vii. తహసీల్దార్ వారి కార్యాలయము, వల్లూరు మండలం, వై.యస్.ఆర్.జిల్లా .
   - viii. పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ కార్యాలయం, పైడికాలువ గ్రామం, వల్లూరు మండలం, వై.యస్.ఆర్.జిల్లా

పైన తెలిపిన ప్రాజెక్ట్‌కు సంబంధించి పరిసర ప్రభావిత ప్రజలు ఏమైనా సూచనలు సలహాలు, అభిప్రాయాలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల ఈ క్రింద ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, కడప, వైయస్.ఆర్. జిల్లా యొక్క సంతకం చేసిన అధికారి వారికి లిఖిత పూర్వకముగా ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి 30 రోజులలోపు పంపించవలెను మరియు పైన సూచించిన తేది మరియు ప్రదేశము వద్ద ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో పాల్గొని కూడా తెలియజేయవచ్చును.

సం/-
పర్యావరణ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయము, కడప, వై.యస్.ఆర్. జిల్లా

ప్రదేశం : కడప
తేది : 07.01.2025

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, కడప. డి.నెం.72/272-5-18, 1వ అంతస్తు, కర్నూలు- చిత్తూరు ఎన్‌హెచ్40 రోడ్డు, వినాయకనగర్ సర్కిల్ దగ్గర, కడప, వైయస్.ఆర్. జిల్లా- 516003.ఫోన్: 08562-244594, ఈమెయిల్: rokdp-ee1@appcb.gov.in

LiFE Lifestyle for Environment

ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

భారత ప్రభుత్వ పర్యావరణము, అడవులు & వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వారి ఇ.ఐ.ఎ. ప్రకటన ఎస్.ఓ.1533, తేది: 14.09.2006 మరియు తదుపరి సర్క్యులర్స్ ప్రకారం, **"గొరిగనూరు-కన్నెలూరు ఇసుక రీచ్ (పెన్నా నది) పేరున రాయల్టీ ఇన్‌స్పెక్టర్, వైయస్‌ఆర్ జిల్లా వారు సుమారు 25 లక్షల వ్యయంతో సర్వే నెం.515, గొరిగనూరు గ్రామం, సర్వే నెం.462, కన్నెలూరు గ్రామం, జమ్మలమడుగు మండలం, వైయస్‌ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో 25 హెక్టార్ల విస్తీర్ణంలో సాలీన 2,50,000 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం** గల సాధారణ ఇసుక త్రవ్వకం కొరకు ప్రతిపాదించిన ప్రాజెక్ట్‌కు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించుట గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, కడప జిల్లా వారు జారీ చేయు ప్రకటన.

ప్రాజెక్ట్ వివరాలు ఈ క్రింది విధముగా ఉన్నాయి:

1. కంపెనీ పేరు, టెలిఫోన్ నెం. మరియు చిరునామా	25 హెక్టార్ల గొరిగనూరు - కన్నెలూరు ఇసుక రీచ్ (పెన్నా నది) సాధారణ ఇసుక గని త్రవ్వకం, సర్వే నెం.515, గొరిగనూరు గ్రామం, సర్వేనెం.462, కన్నెలూరు గ్రామం, జమ్మలమడుగు మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా, సెల్:9000380461, ఈమెయిల్:dmgokadapa@gmail.com
2. ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రదేశం & భూమి విస్తీర్ణం	సర్వే నెం.515, గొరిగనూరు గ్రామం, సర్వే నెం.462, కన్నెలూరు గ్రామం జమ్మలమడుగు మండలం, వై.యస్.ఆర్.కడప జిల్లా, గని లీజు యొక్క మొత్తం విస్తీర్ణం: 25 హెక్టార్లు
3. సంప్రదించవలసిన అధికారి పేరు, చిరునామా మరియు టెలిఫోన్ నెంబరు	శ్రీమతి వై.రాధ, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జిల్లా మైన్స్ & జియాలజీ కార్యాలయం, వై.యస్.ఆర్.కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్- 516001 సెల్:9000380461,ఈమెయిల్:dmgokadapa@gmail.com
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ.25 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాలు	సాధారణ ఇసుక తవ్వకం
6.ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 07.02.2025 సమయం : మ.2.00 గం॥లకు ప్రదేశం : "మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దగ్గర", గొరిగనూరు (గ్రామం), జమ్మలమడుగు (మండలం), వై.యస్.ఆర్. జిల్లా.

7. ప్రతిపాదిత ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరములు సదరు ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సమ్మరీ (తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ EIA/EMP రిపోర్టు ప్రజల సౌకర్యార్థం ఈ క్రింద కార్యాలయములలో లభ్యపరచబడినది.
   - i. జిల్లా కలెక్టరు & జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, కడప, వైయస్.ఆర్. జిల్లా .
   - ii. ముఖ్య కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము, జిల్లా పరిషత్, కడప, వై.యస్.ఆర్. జిల్లా .
   - iii. జనరల్ మేనేజర్ వారి కార్యాలయము, జిల్లా పరిశ్రమల కేంద్రం, కడప, వై.యస్.ఆర్. జిల్లా
   - iv. MoEF & CC, GoI వారి కార్యాలయము, ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్ (ఐఆర్‌ఓ), పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
   - v. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, క్షేత్రీయ కార్యాలయము, వెంకటరమణ కాలనీ, కర్నూలు.
   - vi. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కడప, వై.యస్.ఆర్.జిల్లా .
   - vii. తహసీల్దార్ వారి కార్యాలయము, జమ్మలమడుగు మండలం, వై.యస్.ఆర్.జిల్లా .
   - viii. పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ కార్యాలయం, గొరిగనూరు గ్రామం, జమ్మలమడుగు మండలం, వై.యస్.ఆర్.జిల్లా
   - ix. పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ కార్యాలయం, కన్నెలూరు గ్రామం, జమ్మలమడుగు మండలం, వై.యస్.ఆర్.జిల్లా

పైన తెలిపిన ప్రాజెక్ట్‌కు సంబంధించి పరిసర ప్రభావిత ప్రజలు ఏమైనా సూచనలు సలహాలు, అభిప్రాయాలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల ఈ క్రింద ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, కడప, వైయస్.ఆర్. జిల్లా యొక్క సంతకం చేసిన అధికారి వారికి లిఖిత పూర్వకముగా ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి 30 రోజులలోపు పంపించవలెను మరియు పైన సూచించిన తేది మరియు ప్రదేశము వద్ద ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో పాల్గొని కూడా తెలియజేయవచ్చును.

సం/-
పర్యావరణ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయము, కడప, వై.యస్.ఆర్. జిల్లా

ప్రదేశం : కడప
తేది : 07.01.2025

పెద్దమ్మగుడి అభివృద్ధికి శ్రీకారం

ఎర్రగుంట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తిలో పెద్దమ్మ గుడివద్ద జరుగుతున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పోట్లదుర్తి-హనుమనగుత్తి రోడ్డులో పెద్దమ్మగుడికి చెందిన 3.09ఎకరాల భూమి ఉంది. ఇందులో ఆలయం ఉంది. దీని చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో అభివృద్ధి పనులుచేసేందుకు ఎంపీ సీఎం రమేష్ నిధుల నుంచి రూ.94లక్షలు కేటాయించారు. ఇందుకు కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందులో ప్రహరీ, జిమ్, పార్కులు తదితర అభివృద్ధి పనులున్నాయి. అయితే ఈ పనులను అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించారు. దీంతో ఆర్డీవో సాయిశ్రీ, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, తహసీల్దార్ శోభన్‌బాబు, సర్వేయర్లు, టీడీపీ రాష్ట్ర నాయకుడు సీయం.సురేష్ నాయుడుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ పెద్దమ్మ గుడి స్థలం కబ్జాకాకుండా, అపరిశుభ్రం చేయకుండా ఉండేందుకు ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రహరీ నిర్మించేందుకు లైన్ క్లియర్ చేశారు. దీంతో వెంటనే ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. జాతరలు, ఇతర పెద్ద,పెద్ద పండుగలకు ఇబ్బందిలేకుండా ఎండోమెంట్ వారు ఇచ్చే సలహాల ప్రకారం నాలుగు వైపులా గేట్లు కూడా అమర్చనున్నారు.

రాచమల్లును ప్రజలు నమ్మరు

టీడీపీ నాయకుడు పగిడాల దస్తగిరి

ప్రొద్దుటూరు జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి రామేశ్వరం దేవళాల నుంచి శివాలయం వరకు ఎన్ని పొర్లుదండాలు పెట్టినా ప్రొద్దుటూరు ప్రజలు ఆయనను నమ్మరని టీడీపీ నాయకుడు పగిడాల దస్తగిరి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లుప్రసాద్‌రెడ్డి చేసిన విమర్శలు అర్థరహితమైనవన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపుతున్నారు కాబట్టే కౌన్సిలర్ మునీర్‌పై కేసు పెట్టారన్నారు. బియ్యం మాఫియాను అరికట్టడంలో భాగంగానే రోజు దాడులు చేసి పట్టుకుంటున్నారన్నారు. రాచమల్లు రాజన్న క్యాంటీన్‌పేర 12 ఏళ్ళు అన్నదానం చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేయలేదా అన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

'జార్జిక్లబ్‌పై విమర్శలు తగదు'



మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జార్జికారొనేషన్ క్లబ్‌పై విమర్శలు చేయడం తగదని క్లబ్ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జార్జిక్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 115 సంవత్సరాల చరిత్ర కలిగిన జార్జిక్లబ్‌లో వైద్యులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు 1100 సభ్యులుగా ఉన్నారని తెలిపారు. జార్జిక్లబ్ వివిధ సామాజిక కార్యక్రమాల తోపాటు క్రీడల్లో ప్రోత్సహించడానికి కృషి చేస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఇటీవల జార్జిక్లబ్‌పై విమర్శలు చేయడం తగదన్నారు. క్లబ్‌లో జూదం నిర్వహించడానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఎస్పీ అనుమతి కోరినట్లు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు పేర్కొనడం అవాస్తవమన్నారు. ఇక్కడ జరిగిన అనేక క్రీడాపోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రోత్సహిస్తున్న జార్జిక్లబ్ కార్యవర్గాన్ని అభినందించారన్నారు. నేడు రాజకీయ అవసరాలకోసం క్లబ్‌పై చౌకబారు విమర్శలు చేయడం దారుణమన్నారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు తండ్రి కూడా క్లబ్‌లో మెంబర్‌గా ఉన్నారని పేర్కొన్నారు. క్లబ్ సభ్యుడు శంకర్‌రావు మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు క్లబ్‌లో సభ్యులు స్కిల్‌గేమ్స్ ఆడుకుంటున్నారని ఎవరూ జూదం ఆడటంలేదని పేర్కొన్నారు. సమావేశంలో క్లబ్ సభ్యులు శివచంద్రారెడ్డి, హరిహరప్రసాద్, గోపిరెడ్డి, రామకృష్ణ, గంగిరెడ్డి పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో అన్నదాతలు సాగు చేసేపంటల సమాచారాన్ని ఈ-పంటలో నమోదు పరచడంతో ఈకేవైసీలను త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు బి.సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో రైతు సేవా కేంద్రాన్నిఆయన తనిఖీ చేశారు.

యువత వివేకానందస్వామిని స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యువత వివేకానందస్వామిని స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భూమిరెడ్డి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివేకానందస్వామి జయంతిని పురస్కరించుకుని వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాంపౌండ్ వాల్‌కు అనుమతివ్వాలని జేసీకి వినతి

కడప కలెక్టరేట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పెద్దమ్మ తల్లికి చెందిన 3.09 ఎకరాల్లో కాంపౌండ్ గోడ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతివ్వాలని జేసీ అదితిసింగ్‌కు ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తివాసులు వరప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు. 3.09ఎకరాల భూమి దేవదాయ శాఖలో ఉంది. అందులో సగం భూమి అన్యాక్రాంతమైందన్నారు. ఆ స్థలంలో రాజ్యసభ సభ్యుడు కాంపౌండ్ వాల్, పార్కు, జిమ్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి రూ.95 లక్షల నిధులతో పనులు ప్రారంభించడం పెద్దమ్మ తల్లి భక్తులకు ఆవేదనకు గురి చేసిందన్నారు. కాగా రాజకీయాలకు అతీతంగా పెద్దమ్మతల్లికి చెందిన 3.09 ఎకరాల్లో ప్రహరీ గోడ కట్టాలని జేసీకి విన్నవించడం జరిగిందన్నారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారన్నారు.

రోడ్డు విస్తరణ కాక..అవస్థలు తప్పక

● జటిలంగా మారిన ట్రాఫిక్ సమస్య ● రోడ్డు ఇరుకు..పైగా ఆక్రమణలు





వాసవీ సర్కిల్ నుంచి ఎర్రగుంట్ల, మైదుకూరు రోడ్డులో ఆక్రమణలు, విస్తరణకు నోచుకొని వాసవీ సర్కిల్ నుంచి ఎర్రగుంట్ల రోడ్డు

ప్రొద్దుటూరు అర్బన్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణాలు అభివృద్ధి చెందుతున్నప్పటికీ రోడ్డు విస్తరణ లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల సంఖ్య పెరగడం, ప్రజల రాకపోకలు ఎక్కువ కావడంతో రోడ్లపై ట్రాఫిక్ పెరిగి రోజువారి జీవనం గందరగోళంగా మారింది. ముఖ్యంగా ప్రొద్దుటూరు నగర శివార్లలోని వాసవి సర్కిల్ నుంచి ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు, మైదుకూరు రోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద గల ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో ఈ సమస్య తీవ్రంగా ఉంది. చిన్న రోడ్లపై పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలు చేయడం వల్ల ప్రమాదాలు కూడా తరచూ జరుగుతున్నాయి. మరమ్మతులు లేని రోడ్లు, అధిక పొడవు కలిగిన ట్రాఫిక్ జామ్, పటిష్టమైన ప్రణాళికలలో లోపాలు ప్రజల జీవితాలను మరింత కష్టతరంగా మారుస్తున్నాయి.రోడ్డు విస్తరణ చేయడం ద్వారా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపడానికి ప్రభుత్వం దృష్టి సారించి అవసరమైన నిధులను కేటాయించడం, ప్రణాళిక బద్ధంగా రోడ్డు విస్తరణను చేపట్టడం చాలా అవసరం. ప్రజల సహకారం, వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం ఉంటే మాత్రమే ఈ సమస్యను తీర్చగలుగుతారు.

● రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు కూడా ప్రమాదాలకు కారణం... : రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల వల్ల ప్రజలు ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటు ప్రమాదాలు తరచు చోటు చేసుకుంటున్నాయి. ప్రొద్దుటూరు పట్టణం, చుట్టుపక్కల గ్రామాలు విస్తరిస్తున్న కొద్ది రోడ్లకు సమీపంలో నిర్మాణాలు పెరిగిపోవడం,వ్యాపార సెంటర్లు, దుకాణాలు, క్రమరహిత పార్కింగ్ సమస్య మరింత తీవ్రతరంగా మారడం, ముఖ్యంగా ఆఫీస్ సమయాల్లో ట్రాఫిక్ తీవ్రత అధికమవడంతో ప్రమాదాలకు తావిస్తున్నాయి. వాసవి సర్కిల్ వద్ద ఒక వైపు ఆక్రమణలు, మరొక వైపు బస్ షెల్టర్ లేక ప్రజలు బస్సుల కోసం రోడ్లపైనే మలుపుల వద్ద నిలబడడం, భారీ వాహనాల డ్రైవర్ల నిర్లక్ష్యపు డ్రైవింగ్‌లతో తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

● ప్రభావం ..: అత్యవసర సేవలకు (అంబులెన్స్, ఫైర్ సర్వీస్)దారులు సక్రమంగా లేకపోవడం. విద్యార్థులు, ఉద్యోగులు, స్కూళ్లు, కార్యాలయాలకు ఆలస్యంగా చేరడం. రోడ్డు ప్రమాదాలు పెరగడం లాంటి పరిస్థితులు తరచుగా దర్శనమిస్తున్నాయి.

● ప్రజలకు అవగాహన..: ప్రభుత్వాలు, అధికారుల చొరవతో ప్రజలలో రోడ్డు వినియోగంపై బాధ్యత కలిగించే కార్యక్రమాలు చేపట్టాలి. ఈ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా ప్రజల దైనందిన జీవితం మెరుగుపడడమే కాకుండా, రోడ్డు ప్రమాదాల సంఖ్య కూడా తగ్గుతుంది.

● ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

రోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాలలో రోడ్ల ప్యాచింగ్ పనుల కోసం రూ.22 కోట్ల విడుదల కాగా ఇప్పటి వరకు రూ.10 కోట్ల వరకు పనులు చేశాం. జనవరి చివరి నాటికి 100 శాతం పనులు పూర్తి చేసే లక్ష్యంతో విధులు నిర్వహిస్తున్నాం.

సి. విజయభాస్కర్ రెడ్డి, ఈఈ

నేటి నుంచి పింఛన్ల తనిఖీ

జమ్మలమడుగు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జమ్మలమడుగు మండలంలో ఈనెల 8వ తేదీ బుధవారం నుంచి పింఛన్ల తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సైదున్నిసా తెలిపారు. జమ్మలమడుగు మండలంలోని అన్ని గ్రామాల్లో గత ప్రభుత్వంలో తీసుకున్న పింఛన్లకు సంబంధించి తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పింఛన్‌దారులు సంబంధించిన అధికారులు ఇంటింటికి వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రత్యేకంగా డాక్టర్లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

'స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయవద్దు'

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు తెచ్చే స్మార్ట్‌మీటర్‌లను ఏర్పాటుచేయవద్దని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ నాయకులు మంగళవారం ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డికివినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాయలసీమ ఇన్‌చార్జి ఆయూబ్‌ఖాన్‌లు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ప్రజలకు భారం అవుతాయని, ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాష, మహమ్మద్‌రఫి, ముక్తియార్, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్న కారు

గోపవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి విద్యుత్‌స్తంభానికి ఢీకొట్టింది. బద్వేలు - నెల్లూరు ప్రధాన రహదారిలో మంగళవారం ద్వారకనగర్ వద్ద వాహనం అదుపు తప్పి కరెంటు స్తంభానికి ఢీకొనడంతో స్తంభం విరిగి కారుపై పడింది. అందులో ప్రయాణిస్తున్న భార్యాభర్తకు కొద్దిపాటి గాయాలయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే విద్యుత్ పునరుద్ధరణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రూరల్ సీఐ నాగభూషణం ఘటనాస్థలానికి చేరుకుని విషయాన్ని పరిశీలించారు. అయితే ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని సీఐ తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పోరుమామిళ్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :పదోతరగతి విద్యార్థులకు ఏపీటీఎఫ్ పోరుమామిళ్ల రీజియన్ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. మంగళవారం పోరుమామిళ్లలోని టేకూరుపేట, పుల్లీడు, కలసపాడుమండలంలోని జిల్లా పరిషత్ హైస్కూలు, బి.కోడూరు మండలంలోని గోవిందాయపల్లెలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

ఆరోగ్యకేంద్రం తనిఖీ

దువ్వూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పరిశీలించారు. వైద్యాధికారులు మల్లేష్, సురేష్‌బాబు, వికసిత, రోహిణి, ప్రేమలత, ఇతర ఆరోగ్య సిబ్బందితో సమావేశం అయ్యారు. ఆరోగ్య కేంద్రంలో కాన్పులు, ఇతరత్రా కేసుల గురించి ఆరా తీశారు. ఆశా మీటింగ్‌ను ఏర్పాటుచేసి వీరికి పలు సూచనలు చేశారు. కార్యక్రమ మీటింగ్‌ల గురించి రివ్యూ నిర్వహించారు.

రైతు సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

రాజుపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. మంగళవారం పొట్టిపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భూ సమస్యలున్న రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీటీ మనోహర్‌రెడ్డి, వీఆర్వో అశోక్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

● లక్షలు స్వాహా చేశాడంటున్న ఉపసర్పంచ్



వినతి పత్రం అందిస్తున్న ఉపసర్పంచు, వార్డు మెంబర్లు

ఖాజీపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధికోసం కృషి చేయాల్సిన సర్పంచ్ అవినీతికి పాల్పడ్డారని, తక్షణం వారిపై చర్యలు తీసుకోవాలని ఉపసర్పంచ్ లక్ష్మీరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రావులపల్లె పంచాయతీ సచివాలయంలో డీఎల్‌పీవో విజయభాస్కర్ పరిశీలించారు. నెల రోజుల క్రితం గ్రామ ఉపసర్పంచ్ ఫిర్యాదు మేరకు పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పాత మోటారు వేసి బ్లీచింగ్ పౌడర్ చల్లకపోయినా, వీధి దీపాలు వెలుగకపోయినా లక్షలు స్వాహా చేశారని ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు పంచాయతీకి వచ్చానన్నారు. అనంతరం డీఎల్‌పీవో మాట్లాడుతూ ఫిర్యాదు మేరకు విచారించి నివేదికను డీపీవోకు అందిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మీరెడ్డి, ఏడు గురు వార్డు మెంబర్లు, నాగనాథేశ్వరకోన చైర్మన్ ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు క్రీడల్లో రాణించాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు క్రీడల్లో రాణించాలని తహసీల్దారు గంగయ్య పేర్కొన్నారు. మంగళవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో మహిళలకు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 12జట్లు, 115 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈపోటీలనుప్రారంభించిన తహసీల్దారు మాట్లాడుతూ మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి క్రీడా పోటీలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల శక్తిసామర్థ్యాలను వెలికితీయడానికి నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా వివిధ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు రాయలసీమ వ్యాయామ కళాశాల జట్టు మొదటిస్థానంలో నిలిచి రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన కడప డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథార్టీ జట్టుకు రూ.7 వేలు, తృతీయస్థానంలో నిలిచిన కమలాపురం జీఎస్ఎస్ఆర్ కళాశాలజట్టుకు రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు. టీటీడీ మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్ ,డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి, శూలం ప్రసాద్, సుబ్బయ్య, కేతన ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జెండా ఊరేగింపు



జెండా మెరవణిలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మంగళవారం రాత్రి హజ్రత్ ఖాజాగరీబ్ నవాజ్ స్వాములవారి గంధోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో పెద్దజెండా మెరువణి చేశారు. హజ్రత్ ఖాజాగరీబ్ నవాజ్ స్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గంధంరోజు జమ్మలమడుగులోని గౌషియా పెద్దమకాన్ వద్ద నుంచి పట్టణంలో జెండా ఊరేగింపు చేశారు. ఈసందర్భంగా పట్టణంలో పక్కీర్ల మేళా నిర్వహించారు. గౌషియా మకాన్ వద్ద పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రి, ఆయన కుమారుడు తాహీర్‌పీరాఖాద్రి, ఇతర గురువులు పుస్తక పఠనం చేశారు. భక్తులకు మంచి సందేశం అందించారు. పట్టణంలో జెండా ఊరేగింపు పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి మెరవణి వెంట నడిచారు. పలగాడివీధిలోని బడేగౌస్‌పీరాఖాద్రి స్వామివారి మకాన్‌లో ప్రత్యేక ఫాతేహాలు చేసి నారాయణరెడ్డి మొక్కుకున్నారు.

రేపు జాబ్‌మేళా

జమ్మలమడుగు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 9వ తేదీ గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి విజయకుమార్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ జాబ్‌మేళాలో గ్రీన్‌టెక్ ఇంద్రస్టీస్ ఎయిన్, డిక్షన్ కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, ఆపై చదువుకున్నవారు తమ బయోడేటాతో సర్టిఫికెట్లను తీసుకుని జాబ్‌మేళాకు హాజరు కావాలని వారు కోరారు. వివరాలకు 9000 479991 నంబరును సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి

వైకుంఠ ఏకాదశి మహోత్సవం

బి.కోడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెడ్డివారిపల్లె గ్రామంలో 80 సంవత్సరాల నుంచి ఆనవాయితీగా నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవం 9వతేదీన గురువారం నుంచి 11వ తేదీ శనివారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సాధు కేశవరెడ్డి తెలిపారు. 9న రెడ్డివారిపల్లె, శిరిగిరిపల్లె, గోవిందాయపల్లె, పేరమ్మగారిపల్లె, విజయనగరకాలనీ గ్రామాల్లో స్వామివారి మెరవణి, 10న శుక్రవారం సాదుచెన్నారెడ్డి స్వాములవారి శిష్యబృందంచే హరిభజనలు ఉంటాయన్నారు. అనంతరం కోలాటం, రాత్రికి సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం, 11వతేదీన స్వామివారి తీర్థప్రసాదాలు భక్తులకు అందిస్తారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు వారు తెలిపారు.

మౌలిక వసతుల ఏర్పాటుపై వినతి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలో అమృతనగర్‌లో దివ్యాంగులకు కేటాయించిన వీధుల్లో రోడ్లు, కాలువలు నిర్మించి ఆదుకోవాలని తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందించారు. మంగళవారం ఉదయం ఆల్‌ఆఫ్‌యూ దివ్యాంగుల, వయోవృద్ధుల సేవా ట్రస్టు రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ దివ్యాంగులకు కేటాయించిన వీధుల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని తహసీల్దారును కోరారు. మడూరు రోడ్డులోని దివ్యాంగుల ఇంటి స్థలాలకు కేటాయించిన 9, 10, 11 వీధుల్లో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఖాజామొహిద్దీన్, కాశన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న వేణుగోపాల్

పోరుమామిళ్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నాయీ బ్రాహ్మణులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ డైరెక్టరు కొలవలి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం పోరుమామిళ్లలో నాయీబ్రాహ్మణులతో సమావేశం నిర్వహించారు. ఆయన పథకాలపై అవగాహన కల్పించారు. నాయీ బ్రాహ్మణులందరికీ ప్రభుత్వ పథకాలైన సబ్సిడీ రుణాలు, కటింగ్ షాపులకు ఉచిత విద్యుత్, పక్కా గృహాలపై అవగాహన కల్పించారు. నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కోడూరు లక్ష్మీనారాయణ, కొత్తూరు శివరాం, రామక్రిష్ణ, రామలక్షుమయ్య, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

బ్రహ్మంగారిమఠం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులను విక్రయించాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు ఏడీఏ మర్రిపాటి నాగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని రెండు ఎరువుల పురుగు మందుల షాపులను తనిఖీ చేశారు. అనంతరం పుస్తకాలు, లైసెన్సులు సక్రమంగా ఉన్నాయని పరిశలించారు. కార్యక్రమంలో ఏవో ప్రవీణ్‌కుమార్, గొల్లపల్లె ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

15లోపు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించండి

చాపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఇన్సురెన్స్ బీమా కోసం ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం డబ్బులు చెల్లించాలని ఏవో మ్యాగి కోరారు. మడూరు, అన్నవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వీఏఏలు లక్ష్మణ్, శ్రీలత పాల్గొన్నారు.